క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న మాజీ సైనికులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని మాజీ సైనికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతు ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్‌కు ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సైనిక సంఘ సభ్యుడు, జిల్లా బోర్డు మెంబర్ ప్రొఫెసర్ తిప్పన సిద్ధులు మాట్లాడుతూ.. జిల్లాలోని మాజీ సైనికులకు ఇంటి స్థలాలు అందించే విధంగా కృషి చేయాలని ఆయన కోరుతూ వినతిపత్రం అందజేశారు. ముందుగా మాజీ సైనికులు ఎమ్మెల్యే వెంకట్రావ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుబేదార్, బండారు వెంకన్న, బెన్నర్, మోహన్ రావు, హనుమంతు రావు, తదితరులు పాల్గొన్నారు.

మహాసభలకు తరలిన ఆటోకార్మికులు



చండ్రుగొండ నుంచి సభకు తరలివెళ్తున్న ఆటోకార్మికులు

చండ్రుగొండ: కొత్తగూడెంలో ఆదివారం నిర్వహించన ఏఐటీయుసీ రాష్ట్ర మహాసభలకు ఆటోకార్మికులు తరలివెళ్లారు. కొత్తగూడెం, జూలూరుపాడు, వీఎం బంజర్ అడ్డాలకు చెందిన ఆటో ఓనర్స్, డ్రైవర్లు 30 ఆటోల్లో తరలివెళ్ళారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు యండి.షారీజ్, ఎస్‌కె.యాకుబ్, లక్ష్మీనారాయణ, ఛోటు, నాగరాజు, కృష్ణ, ఖలీల్, యండి.అన్వర్, కె.వెంకటేశ్వర్లు, ఆసీఫ్, రాంబాబు, కె.చిన్న, మౌలాలీ, యండి.రియాజ్ పాష్ పాల్గొన్నారు.

బులియన్ మర్చంట్స్ ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

మణుగూరురూరల్: వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మణుగూరు బులియన్ మర్చంట్స్ అసోసియేషన్, ఉత్సవ కమిటి సభ్యుల ఆధ్వర్యంలో పైలట్‌కాలనీ గోల్డ్‌షాప్ లైన్‌లో ఆదివారం భారీ అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదానంలో భక్తులు వందలాది మంది పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అన్నదానానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అసోసియేషన్ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతరం గురుస్వామి ఉప్పల సత్యనారాయణస్వామిని అసోసియేషన్ సభ్యులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు లంక సత్యనారాయణ, వెచ్చా చంద్ర శేఖర్, కందుకూరి సుబ్రహ్మణ్యం, ఏంఎ నాయుడు, శ్రీనివాసరావు, శంకర్, నరేందర్, ఎస్.శ్రీనివాస్, నరేష్, కె.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి వితరణ



బాధిత కుటుంబానికి వితరణ అంద జేస్తున్న మోరంపల్లిబంజర వాసులు

బూర్గంపాడు: అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమై సర్వం కాలిపోయిన బాధిత కుటుంబానికి మోరంపల్లిబంజర గ్రామస్తులు అండగా నిలిచారు. బత్తులనగర్ గ్రామానికి చెందిన సాడె వెంకటేశ్వర్లుకు చెందిన పూరిల్లు శనివారం అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. ఆ కుటుంబం కట్టుబట్టలతో బజారున పడింది. ఆ కుటుంబానికి మోరంపల్లిబంజర గ్రామస్తులు ఆదివారం నిత్యావసర సరుకులు, దుస్తులు, వంటసామాగ్రి, నగదు అందించి మానవత్వం చాటుకున్నారు. కృష్ణసాగర్ గ్రామపంచాయతీ కార్యదర్శి మూల నాగిరెడ్డి సమాచారం మేరకు మోరంపల్లిబంజర గ్రామస్తులు కైపు లక్ష్మీనారాయణరెడ్డి, సారెడ్డి దామోదర్‌రెడ్డి, సోము ఆదిరెడ్డి, జక్కిరెడ్డి మల్లారెడ్డి, బిజ్జం వెంకట్రామిరెడ్డి, గాదె నర్సిరెడ్డి, గోవింద్, శ్రీకాంత్‌లు సాయమందించారు.

లిఫ్ట్ ఇచ్చేలా లేదు..!

ఉత్తిపోతలుగా మిగిలిన తిమ్మంపేట ఎత్తిపోతలు

- ప్రారంభానికి నోచుకోని లిఫ్ట్ ఇరిగేషన్
- నిర్మాణం పూర్తయినా అందుబాటులోకిరాని వైనం
- సాగునీటి కోసం ఏళ్లతరబడి ఎదురుచూపులు



తుమ్మలకుంట శివారులో నిర్మించిన ఎత్తిపోతల పథకం

ములకలపల్లి: తిమ్మంపేట ఎత్తిపోతలు ఉత్తిపోతలుగా మారాయి. కోట్లు వెచ్చించి నిర్మించినా నేటికీ రైతులకు అందుబాటులోకి రాలేదు. నాలుగేళ్ల క్రితమే పనులన్నీ పూర్తయినా నేటికి ప్రారంభానికి నోచుకోకపోవడం గమనార్హం. మండపరిధిలోని తిమ్మంపేట పంచాయతీ తుమ్మలకుంట గ్రామ శివారులోని పాములేరు వాగుపై లిఫ్ట్ ఇరిగేషన్‌ను నిర్మించారు. రూ.8.94 కోట్ల వ్యయంతో 2015–16 టీఎస్‌పీ నిధులతో తెలంగాణా నీటిపారుదల అభివృద్ధి సంస్థ (టీఎస్ఐడీసీ) ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టగా, 2020 నాటికి పనులన్నీ పూర్తి చేశారు. గిరిజన రైతుల 884 ఎకరాలకు సాగు నీరందించడమే లక్ష్యంగా ఒక్కోటి 200 హెచ్‌పీ సామర్థ్యంగల రెండు మోటార్లను అమర్చి వీటిని వాగుకు అనుసంధానం చేశారు. పథకంలో భాగంగా పంట పొలాలకు పైపులైన్లు వేసి, 12 నీటితొట్లు (డీసీ)లు కూడా నిర్మించారు. దీనికి విద్యుత్ సరఫరా నిమిత్తం ములకలపల్లి సబ్‌స్టేషన్ నుంచి ప్రత్యేకంగా విద్యుత్ లైను వేశారు. ఎస్టిమేట్ ప్రకారం పనులన్నీ అయిపోయిన నేపథ్యంలో, ఇక తమ పొలాలకు నీరందుతుందన్న ఆయకట్టు రైతులు ఆశలు కలలుగానే మిగిలిపోయాయి.

ఆశలు అడియాశలుగానే..

పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తయి నాలుగేళ్లు గడుస్తున్నా రైతులకు అందుబాటులోకి తెచ్చే పరిస్థితి కనిపించడంలేదు. పైగా ఎంతోకాలంగా మోటార్లు ఉపయోగించకపోవడంతో ఇప్పుడు వాటి పనితీరు ఎలా ఉంటుందోననే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పథకాన్ని 2021లో నీటిపారుదలశాఖకు బదిలీ చేయగా, ట్రయల్ రన్ నిర్వహించి, పనితీరును పరిశీలించారు. ఆపై స్థానిక కమిటీ వేసి, స్కీంను స్వాధీన పరచాల్సి ఉంది. ఈ పథకాన్ని కొన్నేళ్లపాటు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించాల్సి ఉంటుంది. మేజర్ రిపేర్లు, ఇతరత్రా మరమ్మతులు ఇరిగేషన్ శాఖ అధికారుల పర్యవేక్షణలో చేపట్టాల్సి ఉంటుంది. ఐతే కమిటీ ఎంపిక అంశం పూర్తిగా మరుగున పడిపోయింది. ఈ నాటికి కమిటీ వేసిన దాఖలాలు లేవు. దీంతో ఈ పథకంపై దృష్టిసారించే వారే కరువయ్యాయి. ప్రస్తుతం ఈ ప్రదేశమంతా పిచ్చిమొక్కలతో నిండిపోయింది. రూ కోట్లతో నిర్మించిన పథకం ఎప్పుడు ప్రారంభం అవుతుందో, తమ భూములకు నీళ్లు ఎప్పుడు అందుతాయోనని ఆయకట్టు రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

వెంటనే ప్రారంభించాలి



నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నా, పథకాన్ని ప్రారంభమే చేయట్లేదు. త్వరితగతిన ప్రారంభించి, రైతులకు అందుబాటులోకి తేవాలి. లిఫ్ట్ ద్వారా పంటచేలకు సాగునీటి కొరతే ఉండదు.

– గౌరి నాగేశ్వరరావు, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

నవంబర్ నాటికి అందుబాటులోకి..



స్థానిక నిర్వహణ కమిటీ ఏర్పాటు చేస్తాం. నవంబర్ నెలాఖరులోగా రైతులుకు అందుబాటులోకి తెస్తాం. కమిటీ పర్యవేక్షణలో పథకాన్ని కొనసాగిస్తాం.

– వెంకటరామన్, ఏఈఈ, ఇరిగేషన్ శాఖ

విస్తృతంగా వాహనాల తనిఖీ



మణుగూరురూరల్: ప్రయాణికుల వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై మేడ ప్రసాద్

మణుగూరురూరల్: మావోయిస్ట్ వారోత్సవాల నేపథ్యంలో మండలంలోని కూనవరం గ్రామం వద్ద మణుగూరు ఎస్సై మేడ ప్రసాద్ సిబ్బందితో కలిసి ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీలో భాగంగా ప్రతీ వాహనాన్ని, సంబంధిత పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనాలపై పెండింగ్ ఛలాన్ల వివరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సరైన పత్రాలు లేని వారికి ఈ–చలాన్లు విధించారు. అనుమానాస్పదంగా కొత్త వ్యక్తులెవరైనా సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వాపురం: మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో మండలంలో పోలీసులు ఆదివారం ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేశారు. సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అశ్వాపురం, మొండికుంట ప్రాంతాల్లో వాహనాలు తనిఖీలు చేశారు.

సీపీఐ నాయకుల నివాళి



రాములు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

మణుగూరుటౌన్: రామానుజవరం మాజీ సర్పంచ్ బాడిశ సతీష్ తండ్రి బాడిశ రాములు శనివారం గుండెపోటుతో గుండెపోటుతో మరణించగా, ఆదివారం భౌతికకాయాన్ని సీపీఐ రాష్ట్ర నాయకులు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి వారి ఆత్మకు శాంతిచేకూరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల పట్టణ కార్యదర్శి జంగం మోహన్‌రావు, దుర్గ్యాల సుధాకర్, మాజీ ఎంపీపీ ఎడారి రమేశ్, ఎస్‌కే సర్వర్, వంగర సతీష్, కామిశెట్టి రామారావు, నోముల రవి, డొంక రాములు, బొర్రా ఎర్రయ్య తదితరులు ఉన్నారు.

ఆదివాసీ నాయకుల నిరసన



దమ్మపేట: నిరసన వ్యక్తం చేస్తున్న ఆదివాసీ నాయకులు

దమ్మపేట: ఆదివాసీల కమ్యూనిటీహాలుకు చెందిన ప్రాంతాన్ని స్వచ్ఛంద సంస్థ పేరుతో ఆక్రమించుకొని శవ పేటికలను ఉంచడాన్ని వ్యతిరేకిస్తూ ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలోని మందలపల్లిలోని కమ్యూనిటీహాల్ స్థలం వద్ద ఆదివాసీ జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ఆదివాసీ నాయకుల విగ్రహాల సమీపంలో శవపేటికలను ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. అంతేకాకుండా ఈ దుశ్చర్య దివంగత ఆదివాసీ నాయకులను అవమానించడమే అని పేర్కొన్నారు. ఈ చర్యను ఖండిస్తూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని తెలియజేశారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు సోయం వీరభద్రం, బండారు సూర్యనారాయణ, తెల్లం రామారావు, కాసిని వెంకటేశ్వరరావు, వాసం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు చురుగ్గా నిర్వహించాలి



ములకలపల్లిలో సభ్యత్వం నమోదు చేస్తున్న బీజేపీ నాయకులు

ములకలపల్లి: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సభ్యత్వ నమోదు ప్రక్రియను చురుగ్గా నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు. సహ ప్రభారి (సభ్యత్వ నమోదు జిల్లా ఇన్‌చార్జ్) రాజేశ్ పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు గుగులోతు శంకర్, కన్వీనర్ కలికపోగు ముసలయ్య అధ్యక్షతన ఆదివారం చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రధాన కార్యదర్శి పూనెం నవీన్, కార్యదర్శి పాయం నర్సింహారావు, పాలకుర్తి ప్రసాద్, రాంబాబు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కలుసుకున్న పూర్వ విద్యార్థులు..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం చర్ల రోడ్డులోని అక్షయ ఫంక్షన్ హాల్‌లో కొర్రాజుల గుట్ట స్కూల్లో (నన్నపనేని మోహన్ స్కూల్) 10వ తరగతి 1990–91 సంవత్సరంలో చదివిన విద్యార్థులు 33 ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు ఈ అపూర్వక కలయికను ఉద్దేశించి మాట్లాడుతూ.. 33 సంవత్సరాల తర్వాత కలవడం ఎంతో ఆనందం వ్యక్తపరిచారు. ఆ రోజుల్లో పాఠశాలలో చోటు చేసుకున్న జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. శరత్ బాబు, వాసు, పరశురాం, సత్యానంద్, కిరణ్ కుమార్, రవి, బర్ల ప్రభాకర్, నాగరాజు, సదానందం, రామ్మోహన్ రెడ్డి, పావని, కనకదుర్గ, అనంతలక్ష్మి, నీలిమ, రాజ్యలక్ష్మి, సూర్య ప్రభ, స్వర్ణలత, లలిత, కనక శ్రీ, సరస్వతి, పద్మజ, సంపత్ కుమారి, నాగ వెంకటలక్ష్మి, రామలక్ష్మి, ఉమాదేవి, పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి, కరస్పాండెంట్ శంకర్

మణుగూరురూరల్: విద్యార్థులు సోషల్ మీడియాకు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని మణుగూరు డీఎస్పీ వంగ రవీందర్ రెడ్డి సూచించారు. మున్సిపాలిటీలోని చేపలమార్కెట్ ఏరియాలో గల స్నేహాగార్డెన్స్‌లో శ్రీవిద్య–కృష్ణవేణి జూనియర్ కళాశాల విద్యార్థులు ఫ్రెషర్స్ డే వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కళాశాల కరస్పాండెంట్ పుచ్చకాయల శంకర్‌తో కలిసి కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులంతా క్రమశిక్షణతో విద్యనభ్యసించాలన్నారు. ప్రతీ విద్యార్థి తాము ఎంచుకున్న లక్ష్యాన్ని పట్టుదలతో, కృషితో సాధించాలన్నారు. చదువులో రాణిస్తూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తద్వారా తల్లిదండ్రులకు, అధ్యాపకులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం 2023–24విద్యాసంవత్సరానికి రాష్ట్ర, డివిజన్ స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు డీఎస్పీ జ్ఞాపికలు అందజేసి అభినందించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డైరెక్టర్ పి.సారంగపాణి, ప్రిన్సిపల్ పి.నాగేశ్వరరావు, శ్రీవిద్య డైరెక్టర్స్ బద్దం శ్రీనివాస్‌రెడ్డి, నూకారపు రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేరు మార్పు నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

మణుగూరుటౌన్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును సురవరం ప్రతాపరెడ్డి పేరుగా మార్చే నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మణుగూరు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు దోసపాటి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు తెలుగు విశ్వవిద్యాలయానికి తొలిగించడం అమానుషం అన్నారు. స్వతంత్ర్య ఉద్యమంలో గాంధీ వెంట నడిచి సత్యం, అహింస, శాంతి మార్గాలను తూచా తప్పకుండా పాటించి సబర్మతి ఆశ్రమంలో గాంధీ వెంట నడిచారన్నారు. అదే స్ఫూర్తితో హరిజనోద్ధరణ కార్యక్రమం ద్వారా హరిజనులు ప్రతి దేవాలయంలో ప్రవేశించేలా ఉద్యమం చేపట్టారని గుర్తు చేశారు. తెలుగు జాతి ఐక్యత కోసం 58 రోజులు ఆమరణ దీక్ష చేసి అసువులు బాసిన పొట్టి శ్రీరాములు లాంటి మహనీయులు చరిత్రను పాఠ్యపుస్తకాల్లో సైతం చదువుకున్నామని, అలాంటి వ్యక్తి పేరు భావితరాలకు తెలుగు జాతికి తెలియజేయాల్సిన ఆవశ్యకతను గుర్తించి కాంగ్రెస్ పార్టీ ఆ నిర్ణయం వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ నిర్ణయంపై అన్ని జిల్లాలు మండలాల నుంచి సీఎం, ప్రజాప్రతినిధులకు వినతిపత్రంఇవ్వాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఈ వివాదాస్పద నిర్ణయం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఆర్యవైశ్యులందరూ ఏకమై భవిష్యత్తులో మరిన్ని ఆందోళనా కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధం అని తెలిపారు.

గౌడకులస్తులు అన్నిరంగాల్లో రాణించాలి



సమ్మయ్యకు నియామక పత్రం అందజేస్తున్న సోమేశ్వర్ గౌడ్

కరకగూడెం: గౌడ కులస్తులంతా ఐక్యంగా ఉంటూ అన్ని రంగాల్లో రాణించాలని 'జై గౌడ సేన జాతీయ సంఘం' ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బుర్ర సోమేశ్వర్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఆదివారం మండల కేంద్రంలో గౌడ కులస్తులతో సమావేశం ఏర్పాటు చేసి ఏకగ్రీవంగా మండల కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన వీరగాని సమ్మయ్య గౌడ్, గౌరవ అధ్యక్షుడిగా తాళ్ల వెంకన్న, ఉపాధ్యక్షుడిగా పూజారి ధనుంజయ, ప్రధాన కార్యదర్శిగా ఎర్ర వెంకటేశ్వర్లుతో పాటు మరికొంత మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకుని నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గౌడ కులస్తుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించి సంక్షేమ పథకాలు అమలు చేయాలనీ కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు ఎర్ర సురేష్, ఎర్ర సత్యం, కొంపెల్లి నారాయణ, జలగం వెంకన్న, కృష్ణ, చీకటి బిక్షపతి, ముంజాల చిన్న మల్లయ్య, సాయిబాబా, సారా సాంబయ్య, దోమల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ములకలపల్లి: రోడ్డు ప్రమాద బాధితులకు ఎస్సై కిన్నెర రాజశేఖర్ బాసటగా నిలిచారు. ఆటో ప్రమాదంలో గాయపడ్డ ఐదుగురు విద్యార్థులతోపాటు, ఆటోడ్రైవర్ ప్రవీణ్ కుటుంబానికి ఒక్కొక్కరికి రూ 5 వేల ఆర్థికసాయం అందించి ఓదార్యాన్ని చాటుకున్నారు. విధి నిర్వహణలో చక్కటి ప్రతిభ కనబరిచిన ఎస్సై రాజశేకర్.. జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ చేతుల మీదుగా రూ.10 వేల నగదు పురస్కారం, ప్రశంసాపత్రం అందుకున్న విషయం తెలిసిందే. దీనికితోడు తన స్వంతంగా మరో రూ.20 వేలు కేటాయించి, మొత్తం రూ.30 వేలను బాధితులకు అందజేశారు. ఆదివారం వీకే. రామవరం గ్రామాన్ని సందర్శించి, రచ్చ ఉపేందర్ కొడుకు యశ్వంత్‌కు, మాజీ సర్పంచ్ కుంభా భాస్కర్ కొడుకు మోక్షిత్‌ల కుటుంబాలకు నగదు అందజేశారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న ఆటోడ్రైవర్‌తోపాటు, మిగిలిన ముగ్గురు విద్యార్థులకు కుటుంబాలకు ఫోన్‌పై ద్వారా నగదు పంపించారు.

ఈ సందర్భంగా ఎస్సై రాజశేఖర్ మాట్లాడుతూ.. వైద్య ఖర్చులకు వినియోగించాలని సూచించారు. క్షతగాత్రులకు ప్రతిఒక్కరూ ఇతోధిక సాయం అందించాలని అన్నారు. కానిస్టేబుళ్లు తిరుపతిరావు, ప్రసాద్, నవీన్, కాంగ్రెస్ నాయకులు కుంజా రవి ఉన్నారు.

'కాలం' మారింది..!

- సెల్‌ఫోన్ల రాకతో గడియారాలకు ఆదరణ కరువు
- స్మార్ట్ వాచ్‌లపైనే యువత మోజు
- గడియారాల అమ్మకందారులు, మెకానిక్‌లకు ఉపాధి అంతంతే..



ఓ దుకాణంలో వివిధ రకాల గోడ గడియారాలు..

మన అవసరాలు తీరుస్తూ ఎంతగానో ఉపయోగపడిన వస్తువులు మారుతున్న కాలానికి అనుగుణంగా కనుమరుగవుతుంటాయి. వాటి స్థానంలో మరొకటి వచ్చి చేరుతుంటాయి. ఇందుకు చక్కటి ఉదాహరణే గడియారాలు, వాచ్లు. ఒకప్పుడు సమయం చూసుకోవాలంటే ఇవే ఆధారం. వాటికి మంచి ఆదరణ ఉండడంతో ప్రతి సెంటర్‌లో వాచ్, గడియారాల దుకాణాలు ఉండేవి. వాచ్ మెకానిక్‌లకు కూడా చేతినిండా పని దొరికేది. స్మార్ట్ వాచ్లు, మొబైల్ ఫోన్ల రాకతో వాటి వినియోగం బాగా తగ్గిపోయింది. మెకానిక్‌లకు పని కరువైంది.

భద్రాచలంఅర్బన్: సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కే కొద్దీ మార్కెట్లో పాత వాటికి గిరాకీ తగ్గుతోంది. దీంతో వాటిపై ఆధారపడ్డవారు ఉపాధి కోల్పోవాల్సి వస్తోంది. దీనికి ఉదాహరణగా వాచ్లు, గడియారాలను చెప్పుకోవచ్చు. గతంలో వాచీల రిపేరు చేసేవారు వీధికి ఒకరు దర్శనమిచ్చే వారు. అప్పట్లో వాచ్ షాపులు ఎక్కువగా ఉండేవి. వాచ్ రిపేర్ వర్క్ నేర్చుకోవడానికి సైతం యువకులు ఉత్సాహం చూపించేవారు. ఇది 2002కు ముందు వరకు ఉన్న పరిస్థితి. ఆ తర్వాత ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఇప్పుడు ప్రతి ఒక్కరి చేతిలోకి సెల్ఫోన్లు వచ్చాయి. సెల్‌ఫోన్‌లోనే టైం చూసుకోవడంతో వాచ్‌లపై ఆసక్తి తగ్గిపోయింది. అప్పట్లో చేతిగడియారాలదే హవా. చేతి గడియారాల వాడకం 17 ఏళ్ల క్రితం ఎక్కువగా ఉండేది. రకరకాల వాచ్లు మార్కెట్లో లభించేవి. సమయం చూసు కోవడానికి ప్రతీ ఒక్కరి చేతిపై దర్శనమిచ్చేది. వీటికి ప్రతి 24 గంటలకు ఒకసారికీ ఇచ్చుకోవాల్సి వచ్చేది. గోడ గడియారానికి సైతం వారానికోసారి కీ ఇస్తే సరిపోయేది. ఇవి దశాబ్దాలు పని చేశాయి. ఇప్పటి ఎలక్ట్రానిక్ గడియారాలు ఐదేళ్లకు మించి పనిచేసే పరిస్థితి లేదు.

జీవనోపాధి దూరం..

ప్రస్తుతం వస్తున్న ఎలక్ట్రానిక్ గడియారాలు, స్మార్ట్ వాచ్లు ఐదేళ్ల కంటే ఎక్కువ కాలం పనిచేయడం లేదు. ఇవి ఎక్కువ రిపేర్లకు కూడా సహకరించవు. గతంలో రిపేర్లు వస్తే ఓవర్ ఆయిల్ చేస్తే సరిపోయేది. కీ రాడ్లు, వాచ్ పైగ్లాస్, ముల్లులు ఎక్కువగా రిపేరు వస్తుండేవి. ఇప్పటి ఎలక్ట్రానిక్ వాచ్లకు బ్యాటరీలు మార్చుకుంటే సరిపోతోంది. ఇప్పటి వాచ్లు యూజ్ అండ్ త్రో లెక్కనే పని చేస్తున్నాయి. దీని వల్ల వాచ్ రిపేర్లు చేసేవారికి చేతినిండా పని లేకుండా పోతోంది. దీంతో వారు జీవనోపాధి కోల్పోతున్నారు. అందుకే ఆ రంగంపై వెళ్లే వారు తక్కువగా ఉన్నారు. అడపాదడపా అన్నట్లుగా ఉన్నవారికి కూడా వాచ్ల సర్వీసింగ్ దొరకడం కష్టంగా మారింది. ప్రస్తుతం వాచ్లు బాగు చేసేవారు పట్టణాల్లో షాపుల ముందు చిన్న చెక్కబల్ల పెట్టుకుని పని చేస్తున్నారు. సర్వం స్మార్ట్‌ఫోన్ల మయం. ఒకప్పుడు రైతులు, విద్యార్థులు ఇలా అన్నివర్గాల వారు ఉదయాన్నే లేవడానికి గడియారంలో అలారం పెట్టుకుని నిద్రలేచేవారు. ఇప్పుడు మొత్తం పరిస్థితి మారింది. సెల్‌ఫోన్ సర్వం అన్నట్లుగా ఉంది. ఫోన్లలో అన్ని రకాల సౌకర్యాలు ఉంటున్నాయి. సెల్‌ఫోన్‌లో తేదీ, సమయంతో పాటు అలారం సౌకర్యం కూడా ఇస్తున్నారు. దీనివల్ల గడియారాల అవసరమే లేకుండాపోయింది.

25 ఏళ్లుగా ఈ వృత్తే ఆధారం..



1986 నుంచి వాచ్, గడియారాల రిపేరు వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నా. అలవాటైన వృత్తి కాబట్టే వదలలేకపోతున్నా. ప్రస్తుతం మొబైల్ యుగం నడుస్తోంది. గడియారాలకు ఆదరణ కరువైంది. మెకానిక్లు లేకపోవడంతో కొందరు గూగుల్ ని ఉపయోగించి అడ్రస్ కనుక్కుని వచ్చి వాచ్లు రిపేర్ చేయించుకుంటున్నారు.

– సత్యనారాయణ, గడియారాల మెకానిక్, భద్రాచలం